

# సంత

## కావిలిపాటి విజయలక్ష్మి

'గుత్తులపుట్టు' సంతకు బయలుదేరారు సింహాచలం, అతని భార్య పెంటమ్మ ముస్తాబయి. సింహాచలం అంచుల పంచ కట్టాడు, గిరజాలు నున్నగా దువ్వుకున్నాడు. ఫుల్ చేతుల సిల్కు లాల్చీ తొడిగాడు అంచుల కాశీ బుజాన వేసుకున్నాడు. అతని బొద్దు మీసాలూ, జుట్టు, కనుబొమలు అన్నీ నెరిశాయి. కాని అతని నోటి బింకం తగ్గలేదు. వొళ్ళు ముడతలుపడినా, నాలుగయిదు మైళ్ళు సునాయాసంగా నడవగల శక్తి ఉందతనికి.

పచ్చఅంచు ఎర్ర సిల్కు చీర కట్టింది పెంటమ్మ. వెండి రూపాయలు పేరు మెడలో వేసుకుంది. చెవులపై బంతిపూలు పెట్టుకుంది. పీచులా ఉన్న నల్లని జుట్టు కొప్పు ముడిచింది. కొప్పులో మందారం ముడిచింది. చెంప పిన్నులు పెట్టింది. చెవులకు ముక్కుకీ ఏజన్సీ నాగరికతలోని నగలే ఉన్నాయి. మెడ చుట్టు ఎన్నో రక్షాబంధాలు. ఇద్దరికీ ఉన్నాయి. గాలి సోకిందనీ, జ్వరమొచ్చిందనీ, ఇంకా తలనొప్పి, ప్రతి శరీర జాడ్యానికి ఓ రక్ష. ఆకో, వేరో దారానికి కట్టి మెడకు కట్టుకుంటె అది పోతుందని వారి నమ్మకం.

పైన చిన్నవాన తుంపరపడుతూ ఉండటంలో, అడ్డాకులతో అల్లిన గొడుగు పెంటమ్మ గుబ్బ గొడుగు సింహాచలం వేసుకున్నారు. చిన్న బుట్ట పెంటమ్మ, ఒక గోనె సంచి సింహాచలం, పట్టుకున్నారు. బుట్టలో రెండు సీసాలు పడేసుకుంది పెంటమ్మ. సంతలో కూరగాయలూ, ఉప్పు, కిరసనాయిలూ కొనుక్కుంటారు.

కొడుకులు ముగ్గురూ పెద్దవాళ్ళయి పెళ్ళిళ్ళయి వేరుపోయారు. ఇప్పుడు ఉంటున్నది ఒక ఇంట్లో వారిద్దరే.

ఒకరి వెనుక ఒకరు గబగబా నడుస్తున్నారు. ఊరు దాటి అడవి తోవ పట్టారు.

పెళపెళ నవ్వాడు సింహాచలం. నవ్వి, "పెంటమ్మా! నీ మొగుణ్ణి ఏట ఏసిన రోజు సరిగ్గా ఇదే!" అన్నాడు మీసం ఎడంచేత్తో పైకి దువ్వుకుంటూ ఆమె వైపు తిరిగి చూస్తూ.

"నడు నడు వర్షవు...." అందామె. ఆమె దృక్పథంలో ఆనాటి దృశ్యం మెదిలి గుండె వణికింది. ఒక్కసారి ముందు నడుస్తూన్న సింహాచలం వైపు చూసింది. పులి.. పావు అనుకుంది.

మౌనంగా నడుస్తూన్న ఇద్దరి కనుల ముందూ గతం కదులుతూంది.

* * *

పెంటమ్మ అందమైన యువతి. అప్పుడు వయస్సులో ఉంది. అప్పుడు ఇప్పటిలా రోడ్లు లేవు. బస్సులు లేవు. పల్లపువాళ్ళు అడవులు ఆక్రమించలేదు. కానీ పాడేరులో పోలీసు స్టేషను ఉంది. మొదటిసారిగా పాడేరు సంతలో పచ్చని పెంటమ్మని చూశాడు సింహాచలం. పలకరించాడు. ఊరూ పేరూ తెలుసుకున్నాడు. "మళ్ళీ సంతకు వస్తావా?" అడిగాడు. వస్తానన్నట్లు తల ఊపింది పెంటమ్మ.

ఆ విషయం ఇంటిదగ్గర తలిదండ్రులకు చెప్పలేదు పెంటమ్మ. మళ్ళీ వారం సంతకు మామ్మూలుగా ముస్తాబయి వెళ్ళింది. పదిమంది నేస్తాలతో సింహాచలం వచ్చాడు. సింహాచలం, చేపలు బేరం చేస్తున్న పెంటమ్మ జబ్బ పట్టుకున్నాడు. అరవబోయి ఆగిపోయింది

పెంటమ్మ. అతనితో వచ్చిన నేస్థులు ఆమెను ఎత్తుకొని 'లోసిలుపుట్టు' వైపు పరుగులు తీశారు. హుందాగా గర్వంగా వారి వెనుక నడిచాడు సింహాచలం.

పెంటమ్మను సింహాచలం మేనమామ కొడుకు ఇంట్లో దాచారు, ముహూర్తం కుదిరేదాకా. పెంటమ్మ తలిదండ్రులు పేచీ పెట్టారు. పెద్దలు తగువు తీర్చి సర్దుబాటు చేశారు.

ముహూర్తం రోజున ముస్తాబుచేశారు పెంటమ్మని. పెద్దల సమక్షంలో ఆమె మెడలో తాడు కట్టాడు సింహాచలం. మేకను కోయించాడు.గుమ్మడి ముక్కల పులుసు, పప్పుతో విందుచేసి సారా అందరికీ పట్టించాడు. అతను ఘనంగా పెళ్ళిచేసుకున్నాడని మెచ్చుకున్నారు కుల పెద్దలు.

శౌర్యమే కాని ధనంలేదు సింహాచలానికి, పెంటమ్మకు చీరలూ, నగలూ ఇవ్వలేకపోయాడు కాని ఎనిమిది సంవత్సరాలు గడిచేసరికి ముగ్గురు పిల్లల తల్లయింది పెంటమ్మ. ఆమెలో, మంచి రంగు చీరలు కట్టాలనే, కోరిక రోజు రోజుకీ వృద్ధిపొందుతూ వచ్చింది.

డబ్బున్న ఓడికి పోవాల. ఈ ఆలోచన మెరుపులా వచ్చిందామెకు.

కింతలి ఆదెయ్య డబ్బునోడు. మనిసి మంచోడు. ఎవరో అనడం వింది. అతనితో పరిచయానికి, పరితపించింది. ఓ రోజు 'గుత్తులు పుట్టు' సంతలోనే చూపించింది తనతో సంతకు వచ్చిన సరోజిని, అదుగో సూడు ఆదెయ్య అని.

చూసింది పెంటమ్మ. పంచా లాల్చీ గిరజాల జుట్టూ, మనిషి పొట్టయినా, డబ్బున్న దర్పం అతనిలో ఉంది. "నా ఎల్దాం" చెయ్యిపట్టుకు లాగింది సరోజిని. ఆమె వెనుక మంత్రం వేసినట్టు నడిచింది పెంటమ్మ.

ముందుగా ఆదెయ్యని పలకరించింది సరోజిని. "ఏటి కొన్నావు? చీరలా, నగలా!" అని.

"నగలే. ఏటిలా వచ్చావు?" అని సరోజనిని ప్రశ్నిస్తూనే పెంటమ్మ వైపు అరకంట చూశాడు ఆదెయ్య. సరోజని పెంటమ్మ ఫలానా అని చెప్పి పరిచయం చేసి సంత జనంలో కలిసిపోయింది.

ఆదెయ్య తను కొన్న బెల్లపువుండ పెంటమ్మకు ఇచ్చాడు. పెంటమ్మ కాదన లేదు. తన చెవిన ఇరుకున ఉన్న బంతి వువ్వు తీసి ఆమె కిచ్చాడు. అందుకుని కొప్పులో ముడుచుకుంది పెంటమ్మ. అవుర సింహచల ఆమె వెంటరాలేదు.

ఆమెమనసు తెలుసుకున్న ఆదెయ్య పెదాలు కదిలీ కదలనట్లు నవ్వుతూ "వచ్చేస్తావా?" అడిగాడు గుసగుసగా.

వచ్చేస్తానన్నట్లు తల ఊపింది పెంటమ్మ.

అంతే మళ్ళీ 'గుత్తులు పుట్టు' సంతకు వెళ్లిన పెంటమ్మ, వెళ్లిపోయింది. 'కింతలి' ఆదెయ్యతో.

ఆదెయ్య తెచ్చిన ఆడమనిషిని అందరూ వింతగా చూశారు. ముగ్గురు బిడ్డల తల్లయినా తరగని అందం పెంటమ్మది.

ఆదెయ్య ఆ రోజే ఊరందరికీ మేకను కోసి విందు చేశాడు.

పెంటమ్మ లేచిపోవటం సింహచలం సహించలేకపోతున్నాడు. అతని రక్తం ఉడికిపోతూంది. అమ్మేది అని అడిగే పిల్లలిద్దరు, తల్లి కోసం ఏడ్చేపిల్లడు ఒకడు. చంపేస్తాను నరికేస్తాను అని కోపంతో ఊగిపోయే కొడుక్కి అతని తల్లి సలహా ఇచ్చింది. "తప్పు అడిగి తీసుకో, ఆదెయ్య దగ్గర. వాడు మోతుబరి రైతు. ఇచ్చేస్తాడు. మరో దాన్ని తెచ్చుకో."

పెద్దల సలహా అదే.... ఆ పెద్దలచేతే కబురుపెట్టాడు సింహాచలం తప్పు కట్టండని.

సింహాచలం తిట్టిన తిట్లూ, మాటలూ, ఆ నోటా ఈ నోటా విన్న ఆదెయ్య "తప్పుకట్టను ఏంజేస్తాడోచెయ్యమనండి" అని మొండికేశాడు.

పంటా, పసువులు, ఐశ్వర్యం. పెంటమ్మ మురిసిపోతూంది. పాత భర్త, పిల్లలు విస్మరించింది. కడువు నిండా తిండి రెండు వారాలు గడిచేసరికి నాలుగు చీరలు. ఆదెయ్య అందగాడు కాకపోయినా తనంటే మనసున్నవాడు, డబ్బున్నవాడు. సంతోషంగా రోజులు గడిపేస్తూంద పెంటమ్మ.

ఆదెయ్యతో లేచిపోయిన నాటికే ఆమె గర్భవతి.

* * *

పిల్లలు తల్లికోసం బెంగపడి పోయారు.చిన్నవాడయితే జ్వరంపెట్టుకు కన్ను తెరవటం లేదు. సింహాచలం తల్లి పిల్లల్ని సాకలేకపోతూంది. సింహాచలాన్కి పిచ్చెక్కిపోతూంది. తప్పు కట్టని ఆదెయ్య మీద, తనకు పిల్లలను వదిలి వెళ్లిపోయిన పెంటమ్మమీద పట్టలేని కోపం వస్తూంది.

ఆ రాత్రి ఆలోచించి అతనొక నిర్ణయానికి వచ్చాడు. ఆ ఇద్దర్నీ చంపి తాను జైలుకు పోవాలని.

కత్తి నూరి పదునుపెట్టి వరలోపెట్టి మొలలో దోపుకున్నాడు. చేత్తో గొడ్డలి పట్టుకున్నాడు మొలకు గుడ్డ కట్టుకున్నాడు చీకటి చీకటిపడే వేళ. నడిచాడు ఆదెయ్య ఊరివైపు.

ఆ రాత్రి 'కింతలి'లో ఓ దూరపు చుట్టం ఇంట్లో విడిదిచేశాడు. ఎందు కొచ్చావు? అనే ప్రశ్నకి తప్పడగడానికి అని జవాబు చెప్పాడు. అతని వాలకం చూసి ఏంచేస్తాడో అని భయపడ్డారు ఆ ఇంటివారు. అయినా తమ కెందుకులే అని ఊరుకున్నారు. ఆ రాత్రి



నిద్రపోలేదు సింహాచలం. ఎఱ్ఱ సిందువ అరిచింది ఇంటి దగ్గరలో. అతను లేచి కూర్చున్నాడేకాని జడవలేదు. అతనంటె అస్సలే చాలా మందికి భయం, అతను మూర్ఖుడు ఏమన్నా చేస్తాడని, చెయ్య గలడని వారి అభిప్రాయం. అతను మర్నాడు చెయ్యబోయే పని గురించి ఆలోచిస్తున్నాడు.

తెలతెలవారుతూంటే లేచి ఊరి బయటకు నడిచాడు. గెడ్డ ఒడ్డున తుప్పల్లో చెట్టుచాటున నక్కి కూర్చున్నాడు. ఆ తోవనే ఆదెయ్య పొలానికి వెళ్తాడు. పెంటమ్మ ఆ రేవుకే నీళ్ళకు వస్తుంది. ఇద్దర్నీ నరికి తాను జైలుకి పోతాడు. తనేమన్నా కానియ్. వాళ్ళని చంపాలి. అదీ అతని పట్టుదల. పగ, కసీను.

పెంటమ్మ నీళ్ళకు వచ్చింది కుండ పట్టుకుని. వంగుని కుండ పారే నీటిలో ముంచుతుంది. చూశాడు సింహాచలం. ఒకటి, రెండూ, పదడుగులు ముందుకు నడిచాడు. ఆమె వైపు చూశాడు. గర్భవతి ఐన పెంటమ్మ మరీ పచ్చగా మిసమిసలాడుతుంది. కడవ తలకి ఎత్తుకుంటూ గట్టుపై ఉన్న సింహాచలాన్ని చూసి తృళ్ళిపడింది. ఆమెతో వచ్చిన మరొక ఇద్దరు స్త్రీలూ అతన్ని చూశారు.

ఈమెను చంపి లాభమేమిటి? ప్చ్. అనుకున్న సింహాచలం వెనుదిరిగి వెళ్ళిపోయాడు. పెంటమ్మ తేలిగ్గా నిట్టూర్చి గబగబా ఊరివైపు నడిచింది.

సింహాచలం వచ్చిన వార్త ఊరంతా పాకింది. మరి నీళ్ళకు రాలేదు పెంటమ్మ.

సాయంత్రం వరకూ గట్లమ్మటా, పుట్లమ్మట ఆదెయ్యకోసం కాసి కాసి విసిగి వేసారి, ఆకలితో దాహంతో నీరసంతో తన ఊరివైపు మళ్ళిపోయాడు సింహాచలం.

అయినా, అతనిలో కసి తీరలేదు. పగ చల్లారలేదు. మనిషి చిక్కాడు. పెద్దవాడిలా తయారయ్యాడు. పెంటమ్మ కడుపు దింపించుకుందని విన్నాడు.

* * *

నగలకోసం ముచ్చటపడే పెంటమ్మకివ్వాలని, పోయిన భార్య తాలూకు నగలు తీసి గడపలో కూర్చుని సబ్బుతో కడుగుతున్నాడు ఆదెయ్య. ఆ నగలవైపు సంతోషంగా ఆసక్తిగా చూస్తూ నిల్చుంది పెంటమ్మ.

చింతచెట్టు గుబురులోనుంచి చూశాడు వారిద్దరివైపు సింహాచలం. అదే అదననుకుని నెమ్మదిగా శబ్దం కాకుండా చెట్టు దిగాడు. ఒరలోంచి కత్తి బయటకు తీశాడు.

ఊరి జనం ఎవరి పనుల్లో వారున్నారు.

ఒక్క వేటున ఆదెయ్య తల ఎగిరి పడింది. పెంటమ్మ కెవ్వున అరిచి పరుగ తీసింది. సింహాచలం బట్టలు రక్తసిక్తమయ్యాయి.

పెంటమ్మ కోసం ఇల్లిల్లూ తిరిగాడు. ఊరి ప్రజలు భయభ్రాంతులయి, ఆవాక్కయిపోయారు. అతనికి పెంటమ్మ దొరకలేదు.

అతనొక రాక్షసుడిలా, పిశాచిలా ఆదెయ్య తలచేత్తోపట్టుకుని అక్కడికి అరుమైళ్ళ దూరాన్ని ఉన్న పోలీసు స్టేషనువైపు నడిచాడు.

అతనూ, అతని రూపం, అతని చేతిలోని ఆదెయ్య శిరస్సూ, అతని రక్తసిక్తమైన బట్టలూ, పోలీసు స్టాఫ్ భయభ్రాంతులయ్యారు. అటవిక జాతి లక్షణాలు అంతరించలేదన్న మాట అనుకుని దిమ్మెరపోయారు.

జరిగినదంతా ఏ మాత్రం దాచకుండా గడగడాచెప్పేసి నన్ను అరెస్టుచెయ్యండి అన్నాడు సింహాచలం.

రిపోర్టు రావాలి అన్నారు పోలీసు వాళ్ళు. అతనొక ఉన్మాదిలా కనుపిస్తున్నాడు వాళ్ళకళ్ళకు.

రిపోర్టు వచ్చింది. అరెస్టయి జైలుకి వెళ్ళిపోయాడు సింహాచలం.

అప్పుడతని పిల్లలకు తలితండ్రులిద్దరూ కరువయ్యారు.

* * *

ఆంధ్రరాష్ట్రం వచ్చింది. చాలామంది ఖైదీలతోపాటు సింహాచలం విడుదలై వచ్చేశాడు.

నున్నటి గుండు అతనూ సరాసరి ఊర్లోకి వచ్చేస్తూంటే పిల్లలు స్త్రీలూ జడుసుకుని ఇళ్ళల్లోకి పరుగులుపెట్టారు. ఒక వయోవృద్ధుడు అతన్ని ప్రశ్నించాడు "నువ్వు సింహాచలానివి కావూ!" అని.

"అవును సింహాచలాన్నే. వదిలేశారు వచ్చేశాను." అన్నాడు సింహాచలం. అతను జైలు నుంచి విడుదలై వచ్చినందుకు అతని తల్లీ పిల్లలూ సంతోషించారు. "మరొక దాన్ని తెచ్చుకో!" మళ్ళీ చెప్పింది తల్లి.

"మరొక దాన్ని తెచ్చుకోవటవా!" అని తల అడ్డంగా తిప్పి,"దాన్నే తెస్తాను" అన్నాడు సింహాచలం.

"వద్దు ఆ ఊరివాళ్ళు నీ మీద కక్షతో ఉంటారు. చంపుతారు. వెళ్లొద్దు" అని మందలించింది అతని తల్లి. అయినా అతను వినలేదు. మరురోజే మళ్ళీ ప్రయాణమయ్యాడు. పంచకట్టి మొలలో కత్తి దాచాడు. లాల్చి తొడిగి తలకు పాగా చుట్టాడు. గొడ్డలి బుజాన వేసుకున్నాడు.

అతని తల్లి మరోసారి చెప్పింది. "ఎళ్ళక. ఆలోచించు పిల్లల ముఖం చూడు" అని. అతను పగలబడి నవ్వాడు. ఇవాళ్ళతో సావో రేవో తేలిపోవాల. తెస్తే దాన్నే తెస్తాను. లేపోతె మళ్ళీ జైలుకి పోతాను." అంతే అన్నాడు.

"దానిపాటి అందకత్తె దొరకదా! అదే ఉన్నదేటి! చిన్నదాన్ని తెచ్చుకుందావు ఆగిపో! పిల్లలు మరిచిపోయారు అళ్ళమ్మని. దేవుడి దయ మన మీదుంది. పోలీసులు వదిలేశారు గండం గడిచింది. అదృష్టవంతుడివి. రాజానా బతుకు. సెడ్డోడివి కామాకు అందరు ఇప్పటికే తిడతన్నారు,"హితువు చెప్పింది.

వినిపించుకోలేదు సింహాచలం. అతనొక మొండి మనిషి. వాకిట్లో నిల్చుని అప్పుడే ఉదయిస్తూన్న సూర్యుడికి మొక్కాడు. బయలుదేరాడు.

అతని వైపు అందరూ విస్మయంగా చూశారు. "ఎక్కడికి వెళ్తున్నాడు నీ కొడుకు?" అడిగారు కొందరు సింహాచలం తల్లి అప్పలమ్మని.

"ఏమో నాకు తెలియదు." అంది అప్పలమ్మ గడుస్తనంగా

ఆవేశం ఉక్రోషం గబగబా అడుగులు వేస్తూ అడవిబాట వెంట 'కింతలి' గ్రామంవైపు నడక సాగించాడు సింహాచలం. ఊరి వెలుపల కొండవాగు దగ్గర అతని అడుగులు ఆగిపోయాయి. అక్కడ బట్టలు ఉతుకుతూ కనుపించింది పెంటమ్మ.

ఆమెవైపు నడిచాడు సింహాచలం. అడుగుల సవ్వడికి తలెత్తిన ఆమె అదిరిపడింది. అతని ముఖంలోకి బెదురు బెదురుగా చూసింది.

అతనికి మీసంలేదు గెడ్డంలేదు. ముఖం బోడిగా ఉంది. నవ్వి, "వస్తావా?" అడిగాడు.

ఆమె అతని ముఖంలోకి భయ భయంగా చూసింది. ఆమెతోపాటు అక్కడ బట్టలు ఉతుకుతున్న ఇద్దరు స్త్రీలు చోద్యం చూస్తున్నారు.

మళ్ళీ అడిగాడు గద్దిస్తూన్నట్లు. "ఏటో సెప్పు. వస్తావా? నన్ను మళ్ళీ జైలుకి పొమ్మన్నావా? అని.

ఆమె గాబరాగా అంది. "లేదు. వస్తాను.... వస్తాను...." అని.

"అయితే బట్టలు ఉతికెయ్," అని అక్కడ ఉన్న ఓ బండరాయి మీద గొంతుగ్గా కూర్చుని బీడీతీసి ముట్టించాడు.

ఆమె చేతులు సన్నగా వణకుతుంటే గుండె దడదడా కొట్టుకుంటూంది. గబగబా బట్టలు పిండి డబ్బాలో కూరింది.

"డబ్బా తలకెత్తుకో...." అజ్ఞాపించాడు సింహాచలం.

డబ్బా తలమీద పెట్టుకుని ఊరి వైపు నడిచింది పెంటమ్మ. ఆమెను అనుసరించాడు సింహాచలం.

అతని వైపు చూసిన కొందరు భయంగా ఇంట్లోకి పారిపోతున్నారు. కొందరు ముఖం చిట్లిస్తున్నారు. దీన్ని తీసుకుపోతాడు కావాలి అనుకున్నారు కొందరు.

డబ్బా ఆదెయ్య ఇంటి గుమ్మంలో దించి, నిల్చుని, పద! అన్నట్లు సింహాచలం వైపు చూసింది పెంటమ్మ.

ఆదెయ్య తల్లి, తమ్ముళ్లిద్దరూ ఇవతలికి వచ్చారు కాని, ఏమిటని ప్రశ్నించలేదు.

"అన్నం తిను. ఆవేళ ఏ చీరలో వచ్చావో ఆ చీర కట్టు" అన్నాడు సింహాచలం.

లోపలికి వెళ్లింది పెంటమ్మ.

వాకిట్లో నిల్చున్నాడు సింహాచలం.

తన కొడుకుని చంపిన రాక్షసుడి వైపు చూస్తే గుండెలు మండాయి ఆదెయ్య తల్లికి. తిట్టాలనీ, అతన్ని నిలువునా కాల్చి చంపాలని, ముక్కలు ముక్కలుగా నరకాలన్నంత కసిగా ఉందామెకు. కానీ ఏమీ చెయ్యలేని నిస్సహాయురాలిని చేస్తుంది సింహాచలం రూపం. దోసిట్లో ముఖందాచుకొని బోరున ఏడుస్తూ చతికిలబడి కూర్చుంది.

సింహాచలం వైపు రెప్ప వాల్చకుండా చూస్తూ ఆమె పక్కన కూర్చున్నారు ఆదెయ్య తమ్ముళ్లు. వాళ్ళు చూపుల్తోనే




సింహాచలాన్ని నిరసిస్తున్నారు. సింహాచలం చాలామంది దృష్టిలో రౌడీ. పొగరబోతు. ఏమయినా చెయ్యగలడు. అదే అభిప్రాయం ఆదెయ్య తమ్ములకు సింహాచలం మీద.

మట్టుసిల్వరి గిన్నెలో అన్నం ఆదరాబాదరా పడ్డించుకొని సింహాచలానికనిపించేలా కూర్చుని తినేసి గిన్నె కడిగి బోర్లించింది. మూలన కొయ్యకు తగిలించి ఉన్న పూలవాయిలు చీర కట్టుకుని వాకిట్లోకి వచ్చి, వరసగా కూర్చున్న ఆదెయ్య తల్లి, తమ్ములవైపు ఓ సారి చూసింది. ఆమెకు ఏమనిపించిందో తల దించుకుంది. పెదవి కదపటానికి గుండెలనిండా భయం పేరుకుని పెదవులు విడనివ్వలేదు. సింహాచలం పక్కన 'పులి'లా నిల్చున్నాడు.

"ఎల్లు. నా కొడుకుని సంపటానికి వచ్చావు." గొణిగినట్లని ఘొల్లున ఏడ్చింది ఆదెయ్య తల్లి.

అందరూ అంతా చూస్తున్నారు. కాని ఎవరూ మాట్లాడలేదు. సింహాచలం వెనుక ఊరుదాటి వెళ్ళిపోయింది పెంటమ్మ.

"ఇదిగో సూడు! నీ కొడుకంటె ఏటనుకున్నావు!" అని పెళపెళ నవ్వాడు సింహాచలం తల్లివైపు చూస్తూ.

ఏదో అనబోయింది ఆమె.

"మరేటీ అనక. అంతా మరిచిపో" అన్నాడు హుందాగా సింహాచలం.

"రా. రా. పిల్లల్ని సూసుకో" అంది కోడల్ని ఆహ్వానిస్తూ అప్పలమ్మ.

ఓ పీడ కల ముగిసింది పెంటమ్మ జీవితంలో.

అప్పటప్పట సింహాచలం పెంటమ్మని ఎత్తిపొడుపు మాటలనటం కద్దు. ఆమె జవాబివ్వదు. లేదా మాట మారుస్తుంది గడుసుతనంగా.

* * *

"నువ్వు మొగుడు వెళ్లినవాడు ఇంత సంత కూడిందా!" ఎకసక్కెంగా అడిగాడు సింహాచలం.

"మంచి కోకలొచ్చినయ్యేమో సూడు. కోకలు లేవు, చిరిగిపోయాయి" అంది పెంటమ్మ మాట మారుస్తూ.

"కోక కాదు మేకపిల్లని, కొనాలి" అన్నాడు సింహాచలం.

"మల్లీ వారం అల్లం అమ్మి కొందువు మేకని," అంటూ ఓ బట్టల దుకాణం ముందు నిల్చుండిపోయింది పెంటమ్మ.




పువ్వుల వాయిలు చీరలు, ముదురు రంగు సిల్కు చీరలూ ఆమె కనులను ఆకర్షించాయి. బేరమాడటం ప్రారంభించింది.

రోడ్లు పడకపూర్వం ఆసంత చాలా చిన్నది. బట్టలు కావాలంటే పాడేరు సంతకే పోయేవారు. తనను తీసుకు వెళ్ళిన కొద్ది రోజుల్లో ఆదెయ్య మూడు పూలకోకలు కొన్నాడు. గుర్తు వచ్చింది పెంటమ్మకి.

"ఈ పూలకోక కొను." అంది ఓ ముతకవాయిలు చీర చూపింది పెంటమ్మ

"మేకపిల్ల కొందాం. వచ్చేవారం కోళ, అల్లం అమ్మి కొనుక్కుందువు గాని. లేపోతే అరువిస్తాడేమో అడుగు" అన్నాడు సింహాచలం.

షావుకారు అరువుబేరం లేదన్నాడు. "పోన్లె కోక కొనేనుకో" అన్నాడు సింహాచలం మనసు మార్చుకుని.

సంతోషంగా కొనుక్కుంది చీర పెంటమ్మ.

తర్వాత నూనె, కిరసనాయిలు, ఉప్పు, బియ్యం కావాల్సిన సరుకులు కొనుక్కుని వేళ ఉండగానే ఊరివైపు మళ్లిపోయారు పెంటమ్మ, సింహాచలం.

పైము మూడు నాలుగు గంటలు అయ్యేసరికి సంత పలచబడిపోతుంది అడవిలో తమ తమ ఊర్లు చేరేవారే చాలామంది కనుక మూడు నాలుగు గంటలు కాకముందే 'సంత' పూర్తి చేసుకుని తమ ఊర్ల వైపు మళ్ళి పోతారు.

మళ్ళీవారం "'గుత్తుల పుట్టు' సంతకు వెళ్దాం పద అల్లం అమ్మి మేకపిల్ల కొందాం" అన్నాడు సింహాచలం. రానంది పెంటమ్మ. ఏ సంతకయినా ప్రయాణ మవుతుంది కాని 'గుత్తులపుట్టు' సంతకు మాత్రం సాధారణంగా వెళ్ళటం తప్పించుకుంటుంది. ఆ సంతలో అడుగు పెట్టగానే 'ఆదెయ్య' గుర్తుకు వస్తాడామెకు. అతన్ని సింహాచలం అంత క్రూరంగా నరికేస్తాడని ఊహించివుంటె ఆమె అతనితో మనువు కెళ్ళేది కాదు.

"కోక కొంటాను వస్తావా?" అన్నాడు సింహాచలం ఎగతాళి చేస్తున్నట్లు.

"నాకే కోకా వద్దు. ఎళ్ళు సీకటి పడకుండా రా. నా వల్లు బాగులేదు. జర మొచ్చినట్టున్నది" అంది పెంటమ్మ.

వెళ్ళిపోయాడు సింహాచలం.

'గుత్తులపుట్టు' సంత. ఆదెయ్య. మరొకసారి గతం కదిలింది పెంటమ్మ ఎదలో. ఏ సంతలో ఏ సంఘటన అయినా మరువగలదు గాని 'గుత్తులపుట్టు' సంతలో ఆదెయ్యతో పరిచయం మాత్రం ఆమె జీవితంలో మరువలేనిది.

